నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ అంబేడ్కర్ కాలనీ, గాయత్రిహిల్స్ ఫీడర్ల పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ, రౌండ్‌టేబుల్ స్కూల్, వినాయక్ నగర్, ఫిలించాంబర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చెల్లప్ప ఇంటి లైన్, ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ, సీఆర్పీఎఫ్ గేట్, చిరంజీవి తల్లి ఇంటి లైన్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ అపోలో ఆస్పత్రి, బంగారు మైసమ్మ ఫీడర్ల పరిధిలోని ఫిలింనగర్, సీవీఆర్ చానల్, సినీనటుడు మురళీమోహన్ ఇళ్లు, బంగారు మైసమ్మ టెంపుల్, మాజీ కార్పొరేటర్ చంద్రమ్మ గల్లి, రహమత్ నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ దివ్యశక్తి అపార్టుమెంట్, బొరబండ ఫీడర్ల పరిధిలోని హోటల్ గ్రీన్ పార్క్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, దివ్యశక్తి అపార్టుమెంట్, శీష్‌మహల్ థియేటర్ ప్రధాన రహదారి, టి.అంజయ్య నగర్, ఇందిరానగర్, సైట్-3, నూర్ మసీద్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ ఎస్ఆర్ నగర్, ఎస్పీఆర్ హిల్స్ ఫీడర్ల పరిధిలోని ఎస్ఆర్‌నగర్ ప్రధాన రహదారి, కమ్యూనిటీహాల్ లైన్, ఆంధ్రా బ్యాంక్, ఎస్పీహెచ్ లైన్, 2 ఆర్టీ, 3 ఆర్టీ, ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.


సమావేశంలో పాల్గొన్న 'అధర్ కోహినూర్స్' ది రాక్స్ ఆఫ్ హైదరాబాద్ డాక్యుమెంటరీ బృందం

హైదరాబాద్ సంస్కృతికి అద్దం పట్టేలా 'అధర్ కోహినూర్స్'

- డాక్యుమెంటరీ దర్శక, నిర్మాత ఉమా మంగల్

పంజాగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర సంస్కృతికి అద్దం పట్టే విధంగా 'అధర్ కోహినూర్స్' ది రాక్స్ ఆఫ్ హైదరాబాద్ డాక్యుమెంటరీ చిత్రం నిలుస్తుందని దర్శక, నిర్మాత ఉమా మంగల్ అన్నారు. ఆదివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రం విశేషాలను ఆమె వివరించారు. గడిచిన కాలంలో నగరంలో భౌగోళికంగా అనేక మార్పులు జరిగాయని.. కొండలు, గుట్టలు, పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉన్న నగరం కాలక్రమేణా వాటిని కోల్పోయిందన్నారు. గత వైభవాన్ని గుర్తు చేసుకునే అంశాలను, ప్రస్తుతం మారిన పరిస్థితులను ఈ చిత్రంలో పొందుపర్చామన్నారు. ఈ సందర్భంగా డాక్యుమెంటరీ 'ఏ లవ్ సాంగ్ టు హైదరాబాద్' పాటను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చిత్ర బృందం సభ్యులు, సేవ్ ది రాక్స్ సొసైటీ సభ్యుడు ఎస్.ఎస్.ప్రసాద్, పద్మ రమేష్, అంజు, శివ భవాని, గోపిక, సురేష్, సీనియర్ పాత్రికేయులు సోమశేఖర్, రాహుల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ స్పైస్ కిచెన్‌లో జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన పూజకు ఆర్థిక సహాయం చేస్తున్న మాజీ కార్పొరేటర్ మామిడి లక్ష్మీబాయి నర్సింగరావు దంపతుల
- బంజారాహిల్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ముక్తినూతలపాడు గ్రామస్థులు

గ్రామస్థుల ఆత్మీయ సమ్మేళనం

అమీర్‌పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఒంగోలు సమీపంలో ఉన్న ముక్తినూతలపాడు గ్రామస్థులు ఆదివారం మోడల్ కాలనీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 92 ఏళ్ల వయసున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యులు, చిన్నపిల్లలు సహా మొత్తం రెండు వందల మంది ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అలరించారు. మోడల్‌కాలనీ ఉపాధ్యక్షులు, జీహెచ్ఎంసీ ఆసరా కమిటీ ఉపాధ్యక్షులు, ముక్తినూతలపాడుకు చెందిన జేఎస్‌టీ సాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నన్నే అడ్డుకుంటారా..!

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబుల హంగామా
- శ్వాస పరీక్షలకు సహకరించకుండా రభస
- పోలీసులపై దాడులు చేస్తున్న వైనం


శ్వాస పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు(ఫైల్)

బంజారాహిల్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో మందుబాబులు పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. నన్నే అడ్డుకుంటావా అంటూ శ్వాస పరీక్షలకు నిరాకరిస్తూ హంగామా సృష్టిస్తున్నారు. పోలీసులు తమను వేధిస్తున్నారని కొందరు.. తాగడం తప్పా అని మరికొందరు రోడ్లపై చిందులు తొక్కుతున్నారు. వీకెండ్ సమయంలో డ్రంకెన్ డ్రైవ్ జరుగుతున్న ప్రాంతాల్లో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. పోలీసులు ఎంత నచ్చజెప్పినా వినిపించుకోకుండా కొందరు మందుబాబులు బూతులతో రెచ్చిపోతున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులపై దాడులకు సైతం పాల్పడుతున్నారు. ముఖ్యంగా పబ్‌లు అధికంగా ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో అర్ధరాత్రి సమయాల్లో ఇలాంటి ఘటనలు నిత్యం కనిపిస్తున్నాయి.

క్యాబ్‌కు డబ్బుల్లేవ్..

మా ఆవిడ తిట్టింది సార్, అందుకే తాగాను.. పరీక్షల్లో ఫెయిల్ అయ్యా సర్, ఇంట్లో చెప్పలేక మందేశా.. స్నేహితుడి భర్తడే అని కొంచెం తాగాను సర్.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడుతున్న మందుబాబులు ఇలాంటి కారణాలు చెబుతూ పోలీసులను విసిగిస్తున్నారు. మద్యం తాగినప్పుడు వాహనం నడపకుండా క్యాబ్‌లో వెళ్లొచ్చు కదా అని పోలీసులు సూచిస్తే, అందుకు డబ్బు లేదని చెబుతున్నారు. మద్యం కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తాం కానీ ఇంటికి చేరేందుకు పది రూపాయలు కూడా వెచ్చించేందుకు మందుబాబులు ఇష్ట పడటం లేదని కౌన్సెలింగ్‌లో తేలిన అంశం.

పోలీసులపై దాడులకు యత్నం..

ఇటీవల బంజారాహిల్స్ పార్క్ హయత్ వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పబ్‌లో పార్టీ చేసుకొని వస్తున్న యువత పోలీసులను చూశారు. దీంతో డ్రైవింగ్ సీటులో ఉన్న యువకుడు తాను తప్పుకొని ఆ సీటును యువతికి ఇచ్చాడు. ఇది చూసిన పోలీసులు వారిని ప్రశ్నించగా పోలీసులపై చిందులు తొక్కారు. కానిస్టేబుల్ ఫోన్ తీసుకుని నేలకేసి కొట్టారు. మరో ఘటనలో జూబ్లీహిల్స్ డైమండ్ హౌస్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నడుస్తుండగా ఓ కారులో వచ్చిన యువకుడిని శ్వాస పరీక్ష చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. పరీక్షకు సహకరించకుండా సుమారు రెండు గంటలు ఇబ్బంది పెట్టాడు. చివరకు శాంతిభద్రతల పోలీసులు వచ్చి అతడికి పరీక్ష చేయగా 130 పాయింట్లు వచ్చింది. మరో ఘటనలో డ్రైవర్ సీటులో ఉన్న యువకుడు కానిస్టేబుల్‌పై చెయి చేసుకున్నాడు. ఈ ఘటన జరిగిన 24 గంటల లోపే మద్యం మత్తులో రాహుల్ అనే యువకుడితో పాటు కారులో ఉన్న మహిళ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. మహిళలు సైతం మద్యం మత్తులో కారు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. గడిచిన ఏడాదిలో 28 మంది మహిళా డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదు చేయగా.. ఈ ఏడాది అక్టోబరు చివరి వరకు ఏకంగా 19 మంది మహిళలపై కేసులు నమోదయ్యాయి. అయితే యువతులు అధికంగా మద్యం తాగడానికి పబ్‌లే ప్రధాన కారణమని ఓ స్వచ్ఛంద సంస్థ సర్వేలో తేలింది.

సహకరించకుంటే కేసులు నమోదు చేస్తాం



మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. పౌరుల రక్షణను దృష్టిలో పెట్టుకొని డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మద్యం తాగే వారు డ్రైవర్లను పెట్టుకుంటే సరిపోతుంది. ఇలా చేయకుండా ఇష్టం వచ్చినట్టు వాహనాలు నడుపుతున్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తాం.
- కట్టా హరిప్రసాద్, పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ


వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సాత్విక గుప్తా

కళింగ కల్చరల్ హాల్‌లో 'జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన'

బంజారాహిల్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శనను ఆదివారం రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్ ఫౌండర్, ఆక్యుపేషనల్ హెల్త్ ఎన్విరాన్‌మెంటల్ సేఫ్టీ ఆఫీసర్ సాత్విక గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. నేటి తరం యువత కూడా హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు, చేతిపని బృందాలు చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 17 వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లికార్జున ఖర్గే, కోట నీలిమ తదితరులు

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కోట నీలిమ

అమీర్‌పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోట నీలిమ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అమరావతి లోక్‌సభ పరిధిలోని తియోసా అసెంబ్లీ నియోజకవర్గంలో మహా వికాస్ అగాడీ కూటమి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా తియోసా నియోజకవర్గంలో విజయం సాధించేందుకు అవసరమైన పలు సూచనలను ఆమె పార్టీ నేతలకు సూచించారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- దివ్యాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య


రాష్ట్ర గిరిజన సంఘం లోగో, జెండాను ఆవిష్కరిస్తున్న వీరయ్య, బాల్‌రాజ్ యాదవ్, రవినాయక్ తదితరులు


పంజాగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ దివ్యాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర గిరిజన సంఘం ఆవిర్భావ సభ నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెల పెంపకందారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్‌తో కలిసి సంఘం జెండా, లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. గిరిజనులు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు అంగోతు వెంకన్న, ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, జవహర్ నాయక్ పాల్గొన్నారు.


వివిధ కోర్సులు, డీఎస్సీలో మెరిట్ సాధించిన పత్రాలు చూపిస్తున్న హిందీ పండిట్ పరిరక్షణ సమితి ప్రతినిధులు

హిందీ భాషా పండితులకు న్యాయం చేయాలి

- హిందీ పండిట్ పరిరక్షణ సమితి విజ్ఞప్తి

పంజాగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా చేపడుతున్న హిందీ ఉపాధ్యాయుల నియామకాల్లో విద్వాన్, విశారద, ప్రవీణ డిగ్రీలు చేసిన వారికి అవకాశం కల్పించాలని తెలంగాణ హిందీ పండిట్ పరిరక్షణ సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 25తో నిరుద్యోగ భాషా పండితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, పాతపద్ధతి ప్రకారమే నియామకాలు చేపట్టాలని సమితి అధ్యక్షుడు కె.నరేందర్‌గౌడ్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హిందీ భాషా పండితులు, డీఎస్సీలో ర్యాంక్ సాధించి కొన్ని రోజులు ఉద్యోగాలు చేసి వాటిని కోల్పోయిన వారితో కలిసి వారు మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ తమను అనర్హులుగా ప్రకటించడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.


కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

కళారూపాలు మానవాభివృద్ధికి జీవనాధారం

బేగంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కళారూపాలు మానవాభివృద్ధికి జీవనాధారమని వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ క్రాంతి వీరమాచినేని అన్నారు. అపురూపమైన కళలు, కళాకారులను ప్రపంచానికి పరిచయం చేసే కార్యక్రమాలను వాక్ ఫౌండేషన్ నిర్వహిస్తుందన్నారు. బేగంపేటలోని వైట్ హౌస్‌లో 25 ప్రత్యక్ష ప్రదర్శనలతో నిర్వహించిన కళా ఉత్సవం విజయవంతమైంది. ఈ ఉత్సవంలో భాగంగా శాస్త్రీయ నృత్యాలు, స్టాండప్ కామెడీ, సంగీతం, కూచిపూడి విభాగాల్లో పలువురు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ప్రతిభ చాటిన కళాకారులకు భారత ప్రభుత్వ జీవన సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ మీనాక్షీపద్మనాభన్, డాక్టర్ సతీష్ విఖ, వైష్ణవి పులిపాటి బహుమతులను అందజేశారు.


మాట్లాడుతున్న క్లైమేట్ ఫ్రంట్ హైదరాబాద్ ప్రతినిధి రుచిత్ ఆశా కమల్

'మూసీ'ని కాపాడుకుందాం

- రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాం
- 'మూసీ నదిని కాపాడుండ్రీ' సమావేశంలో వక్తలు

పంజాగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైవిద్యం పేరుతో ప్రకృతిని మార్చే శక్తి మానవులకు లేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్లైమేట్ ఫ్రంట్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మూసీ నదిని కాపాడుండ్రీ అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్రంట్ ప్రతినిధి రుచిత్ ఆశా కమల్, జమ్ముకు చెందిన అన్మోల్ ఓహిరి, ఒమర్, పృథ్వీరాజ్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ విఠల్, అరుణ్య, జాన్ మైఖేల్, రవిబాబు పిట్టల తదితరులు మాట్లాడారు. మూసీ నదిని కాపాడుకుందామని.. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామని వారు అన్నారు. ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో మూసీ రూపాన్ని ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో ఏం సాధించారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వక్తలు.. మూసీ ప్రక్షాళన విషయంలో కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.


ఉత్తమ కవితా బహుమతి అందుకుంటున్న మాధవీలత

ప్రజాకవి కాళోజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

రవీంద్రభారతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, భారత్ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవితా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు తమ కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా రసమయి సంస్థ అధినేత డా.ఎం.కె.రాము హాజరై కవులను సత్కరించి అభినందించారు. అంతకుముందు 150మంది కవులు కాళోజీపై కవితలను చదివారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఉత్తమ కవితా బహుమతి మాధవీలతకు అందజేశారు.కార్యక్రమంలో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, దర్శకుడు రాంబాబు, శశిబాల పాల్గొన్నారు.

నందవరం మృదులకు పూర్వ విద్యార్థుల సన్మానం



హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు అందుకున్న డా. నందవరం మృదులకు బాలల దినోత్సవం సందర్భంగా నవంబరు 14 వ తేదీన ఘన సన్మానం చేస్తునట్లు ఆదివారం సికింద్రాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. డా.మృదుల ఒకటి నుంచి పదో తరగతి వరకు సికింద్రాబాద్‌లోని పరోపకారిణి బాలికోన్నత పాఠశాల (సీతమ్మ బడి)లో చదివి, తెలుగు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకోవడంతో పాటు బంగారు పతకం సాధించారు. డిగ్రీ, పీజీలో మూడు బంగారు పతకాలు అందుకోవడంతో పాటు ఎంఫిల్‌లో డిస్టింక్షన్ సాధించారు. విద్యాత్మక, సేవా కార్యక్రమాలలో ఆమె సాధించిన ప్రగతిని గుర్తించి పలు సంస్థలు అవార్డులను అందించాయని విజయలక్ష్మి తెలిపారు. తమ పాఠశాలలో చదువుకుని ఇంతటి అభివృద్ధిని సాధించిన మృదుల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థుల అభినందన సభకు పూర్వ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరవుతారని ఆమె పేర్కొన్నారు.



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహన డ్రైవర్ శ్రీరామ్

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

బోయిన్‌పల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వాహనంతో పాటు 12 క్వింటాళ్ల బియ్యాన్ని బోయిన్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌ఐ శివశంకర్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నతోకట్ట ప్రాంతంలో ఆదివారం కొందరు వ్యక్తులు తుఫాన్ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యంను తరలిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వాహనాన్ని 12 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు డ్రైవర్ శ్రీరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ దందా నిర్వాహకుడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన షేక్ అహ్మద్ పరారీలో ఉన్నాడు. డ్రైవర్‌ను అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

'కులగణన సర్వేలో అందరూ భాగస్వాములు కావాలి'

తార్నాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి పాటుపడేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కులగణన సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి అన్నారు. ఈ మేరకు ఆదివారం తార్నాకలోని సమాజ్‌వాది పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కులగణన.. పేదరికం, విద్య, వైద్యం, గృహ అవసరాల స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు, రిజర్వేషన్లను అమలు చేయడంలో ఎంతో తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. కులగణనకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రతిపక్షపార్టీలకు చెందిన కొంతమంది నాయకులు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టించడం సమంజసం కాదని సూచించారు. అదేవిధంగా ప్రజలకు కులగణన ప్రాధాన్యతను వివరించేందుకు ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు పాదయాత్ర నిర్వహించి ప్రజలను మరింత చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వంశా తిలక్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

తిరుమలగిరి నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు వంశా తిలక్ డిమాండ్ చేశారు. ఆదివారం బొల్లారం రిసాలబజార్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మాల సామాజిక వర్గానికి చెందిన కొందరి ఒత్తిడి మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయడం లేదని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా మందక్రిష్ణ మాదిగ చేసిన పోరాటంతో భారతదేశ అత్యున్నత న్యాయస్థానం వర్గీకరణ చేయాలని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, ఇటిక శ్రీ కిషన్ మాదిగ, ప్రజా వాగ్గేయకారులు ఎంఆర్‌పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్వై అశోక్, బీజేపీ సీనియర్ నాయకులు ఆరెపల్లి పరశురాం, దుబ్బ మురళి, నవీన్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మడ్‌ఫోర్టు గుడిసెవాసుల కష్టాలు తీరేనా?

● ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రతిపాదనలకు సీఎం రేవంత్‌రెడ్డి పచ్చజెండా ఊపేనా? ● రక్షణ శాఖ బెదిరింపులకు ముగింపు పడేనా? ● కంటోన్మెంట్‌లోని గుడిసెవాసుల్లో గంపెడాశలు

సికింద్రాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పాతిక సంవత్సరాలుగా ఆ గుడిసెవాసులు పడుతున్న కష్టాలకు మోక్షం లభించేనా? గూడు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ తరచూ ఎదురవుతున్న రక్షణ శాఖ బెదిరింపులకు ముగింపు కలిగేనా? గ్రేటర్‌లోని ఇతర బస్తీలు, మురికివాడల ప్రజల మాదిరిగానే అన్ని సదుపాయాలు అందేనా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ్యుడు ఎన్.శ్రీగణేష్ పేదల గృహ నిర్మాణం విషయమై ప్రతిపాదనలు సమర్పించనున్న నేపథ్యంలో కంటోన్మెంట్‌లోని మడ్‌ఫోర్టు గుడిసెవాసుల్లో గంపెడాశలు చిగురిస్తున్నాయి.

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని జూబ్లీబస్ స్టేషన్ నుంచి బోయినపల్లి డైమండ్ పాయింట్ మార్గ మధ్యలో ఉన్న రక్షణ శాఖ స్థలంలో పాతికేళ్ల నుంచి పలువురు పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. కంటోన్మెంట్‌తోపాటు రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన 520 కుటుంబాలు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతర మురికివాడలు, బస్తీల్లో మాదిరిగా సరైన మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ విద్యుత్ సదుపాయాలు లేకపోయినప్పటికీ.. ఉన్నదాంట్లో సరిపుచ్చుకుంటూ నెట్టుకొస్తున్నారు. మౌలిక సదుపాయాలతోపాటు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా రక్షణ శాఖ నుంచి అడ్డంకులు అవుతుండడమే అందుకు కారణం. పైగా ఏ క్షణంలో మిలిటరీ అధికారులు, జవాన్లు రంగంలోకి దిగుతారో, ఈ స్థలాన్ని ఖాళీచేసి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు చేస్తారోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కాగా దాదాపు 10 ఎకరాల రక్షణ శాఖ స్థలం ఉండగా, దానిలో 5ఎకరాలలో గుడిసెలు వేసుకుని బతుకుతున్న ఈ నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలన్న విజ్ఞప్తులు ఎప్పటినుంచో ఉన్నాయి. రక్షణ శాఖతో మాట్లాడి, భూ బదలాయింపు కింద ఈ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పించి, ప్రత్యామ్నాయంగా రక్షణ శాఖకు వేరే చోట స్థలాన్ని ఇప్పిస్తామంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు. అయితే తాజాగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ చొరవ తీసుకోవడంతో వారిలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ముఖ్యమంత్రిని కలిసి భూబదలాయింపు విషయమై మాట్లాడాలని, 10 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం ద్వారా ఈ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని శ్రీగణేష్ ప్రతిపాదనలు రూపొందించారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలకు సీఎం ఆమోదం తెలపాలని, తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకాలని గుడిసెవాసులు ఆకాంక్షిస్తున్నారు.



కంటోన్మెంట్‌లోని మడ్‌ఫోర్టు గుడిసెలు

గృహ వసతి కల్పించాలని అనుకుంటున్నా..



చాలా కాలంగా మడ్‌ఫోర్టు గుడిసెవాసుల అవస్థలను చూస్తున్నా. మంచినీరు, మురుగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు తదితర సదుపాయాల కల్పనకు నా సొంత నిధులతో వారికి అండగా నిలిచా. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలిచినందున శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టే అవకాశం లభించింది. దాదాపు 10 ఎకరాల స్థలంలో సగ భాగంలో ఈ పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి, వారికి గృహ వసతి కల్పించాలని అనుకుంటున్నా. మిగతా సగ భాగంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేయించాలని అనుకుంటున్నా. ఈ విషయాలపై లోతుగా అధ్యయనం చేశాం. ఈ రెండు పనులు జరిగితే అటు పేదలకు గృహ నిర్మాణం, ఇటు చిన్నారులకు విద్యా సదుపాయం కలగనుంది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పిస్తా.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

పాతికేళ్ల మా సమస్యలకు శాశ్వత పరిష్కారం



పాతికేళ్ల మా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం. నగరంతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని పలు జిల్లాల నుంచి పొట్టచేతపట్టుకుని వచ్చి ఇక్కడ జీవిస్తున్నాం. రిక్షాలు, ఆటోలు నడుపుకుంటూ, కూలీ పని చేసుకుంటూ, భవన కార్మికులుగా నాలుగు పైసలు సంపాదిస్తూ బతుకు బండి లాగుతున్నాం. మాకు నల్లాలు, కరెంటు మీటర్లు ఉన్నప్పటికీ, మిలిటరీ నుంచి ఏ క్షణంలో ఎటువంటి ముప్పు ఎదురవుతుందోనని భయంగా ఉంది.

- ఉత్తరయ్య (స్థానికుడు)

ఎమ్మెల్యే ద్వారా సాధ్యమని నమ్ముతున్నాం



శ్రీగణేష్ మా గుడిసెవాసులకు చాలా ఏళ్లుగా సుపరిచితులు. చాలాసార్లు మా వద్దకు వచ్చి, మాకు అండగా నిలిచారు. మంచినీళ్లు, డ్రైనేజీ, కరెంటు, మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో సహకారం అందించారు. కొద్ది నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో శ్రీగణేష్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో మాలో ధైర్యం మరింత పెరిగింది. ఇప్పుడు సీఎంని కలవనుండడంతో మా కష్టాలు తీరనున్నాయి.

- శ్రీనివాస్ (స్థానికుడు)



కళాసగూడలో పాదయాత్ర చేస్తున్న యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : అరవింద్

తిరుమలగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బొల్లారం ప్రాంతంలోని కాలనీలు బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జీ.అరవింద్ అన్నారు. ఆదివారం బొల్లారంలోని రిసాల బజార్ కళాసిగూడలో పాదయాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. మహిళలు డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్య అధికంగా ఉందని ఆయనకు తెలిపారు. కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడి మంచినీటి, డ్రైనేజీ, వీధి దీపాల వంటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డ్-8 ప్రతీ బస్తీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ప్రధానంగా అంతర్గత రోడ్ల అభివృద్ధికి అధికారులతో మాట్లాడతానని అన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

అమీర్‌పేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని ముక్తినూతలపాడు గ్రామ వాస్తవ్యులు ఆత్మీయుల సమ్మేళనాన్ని ఆదివారం అపూర్వంగా నిర్వహించారు. 92 ఏళ్ల వయసున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యులు, చంటి పిల్లలు మొత్తం 200 మంది వరకు ఒకేచోట కలిసి తమ ఆత్మీయ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

11 నుంచి గురునానక్ జయంత్యుత్సవాలు



జయంత్యుత్సవాల బ్రోచర్‌తో గురుద్వారా ప్రబంధక్ కమిటీ ప్రతినిధులు

సికింద్రాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సిక్కుల గురువు గురునానక్ 555వ జయంత్యుత్సవాలను జంటనగరాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు గురునానక్ దేవ్‌జీ ప్రబంధక్ కమిటీ అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సైతం ఆహ్వానించనున్నట్లు వారు వెల్లడించారు. ఆదివారం సికింద్రాబాద్ గురుద్వారాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు బల్దేవ్‌సింగ్ బగ్గా, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌సింగ్, అఫ్జల్‌గంజ్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు సత్వీందర్‌సింగ్ బగ్గా, ప్రధాన కార్యదర్శి జోగిందర్‌సింగ్ ముజ్రా, హర్‌ప్రీత్‌సింగ్ గులాటీలు గురునానక్ జయంత్యుత్సవాల వివరాలు వెల్లడించారు. ఈనెల 11వ తేదీన సాయంత్రం 4గంటలకు సికింద్రాబాద్ గురుద్వారా నుంచి నగర్ కీర్తన్ (ప్రదర్శన) ప్రారంభమవుతుందని, వేలాది మంది భక్తులతో మనోహర్ థియేటర్, క్లాక్‌టవర్, ప్యాట్నీ, రాష్ట్రపతి రోడ్డు, మోండా మార్కెట్, ఆల్ఫా హోటల్ మీదుగా సికింద్రాబాద్ గురుద్వారా వరకు కొనసాగుతుందని తెలిపారు. అందంగా ముస్తాబు చేసిన వాహనంలో పవిత్రమైన గురు గ్రంథ్‌ను ఏర్పాటు చేసి, పవిత్ర కీర్తనలతో ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా సిక్కుల మార్షల్ ఆర్ట్ గట్కా విన్యాసాలు అలరించనున్నాయని పేర్కొన్నారు.ఈనెల 15వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో విశాల్ దివాన్ కార్యక్రమం జరుగుతుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కలిపి 30వేల మంది సిక్కులు పాల్గొంటారని తెలిపారు.

కంటోన్మెంట్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



6వ వార్డులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, రామకృష్ణ

బోయిన్‌పల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి ఆకర్షితులైన 6వ వార్డులోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువకులు, ప్రజలు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. నిర్మల జైన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, మాజీమంత్రి విజయరామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చి గత 20 సంవత్సరాలుగా నివసిస్తున్న స్థానిక యువకులు బీజేపీ సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు నర్మద మల్లికార్జున్, వంశతిలక్, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, అజయ్ గౌడ్, సాయిప్రకాష్, నరేందర్, భావన కాలనీ, అమరజ్యోతి కాలనీ, సొనాలి కాలనీ, పద్మజ కాలనీలకు చెందిన స్థానికులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలు నా ఖర్చుతో చేయిస్తా : శ్రీగణేష్



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మడ్‌ఫోర్టు సెయింట్ ఆంథోనీస్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ సందర్శించారు. వైద్యసేవలు అందిస్తున్న తీరుతెన్నులను పరిశీలించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అవసరమైన వారికి తన సొంత నిధులతో నేత్ర శస్త్రచికిత్సలు జరిపిస్తానని హామీ ఇచ్చారు. చర్చి ఫాదర్ జోసఫ్, డాక్టర్ బాల్‌రెడ్డి, లెస్లి, జేసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం: రామకృష్ణ



స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న రామకృష్ణ

మారేడుపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జన్యావుల రామకృష్ణ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు పరిధి దుర్గయ్య గార్డెన్‌లో బస్తీబాట కార్యక్రమం ద్వారా స్థానికులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీరు అవసరం మేరకు రావడం లేదని స్థానికులు ఆవేదనవ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన రామకృష్ణ మాట్లాడుతూ.. తాగునీటిపై రాష్ట్ర ప్రభుత్వం మీద పోరాటం చేస్తామని కోర్టులో ఈ విషయంపై కేసు వేశామని అతి త్వరలో తీర్పు వెలువడుతుందన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన ఏకైక సీటు కంటోన్మెంట్. కానీ కంటోన్మెంట్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదని ఆరోపించారు. సర్వేల పేరుతో, హైడ్రా, మూసీ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించి ఆరు గ్యారెంటీల నుండి దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్, రవి, స్థానికులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన కళాకారులకు అవార్డులను అందజేస్తున్న మీనాక్షీ పద్మనాభన్, డాక్టర్ సతీష్ శిఖ తదితరులు

ఆకట్టుకున్న కళా ఉత్సవం

బేగంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన కళారూపాలు మానవాభివృద్ధికి జీవనాధారమని వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ క్రాంతి వీరమాచినేని అన్నారు. వాక్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో అపురూపమైన కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ, ప్రపంచానికి పరిచయం చేసే కార్యక్రమాలను వాక్ ఫౌండేషన్ నిర్వహిస్తోందన్నారు. ఈ మేరకు బేగంపేటలోని వైట్ హౌజ్‌లో 25 ప్రత్యక్ష ప్రదర్శనలతో నిర్వహించిన కళా ఉత్సవం విజయవంతమైంది. ఈ ఉత్సవంలో భాగంగా శాస్త్రీయ నృత్యాలు, స్టాండప్ కామెడీ, సంగీతం, కూచిపూడి విభాగాల్లో పలువురు ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రతిభ చాటిన కళాకారులను భారత ప్రభుత్వ జీవన సాఫల్య అవార్డును పొందిన డాక్టర్ మీనాక్షీ పద్మనాభన్, డాక్టర్ సతీష్ విఖ, వైష్ణవి పులిపాటి బహుమతులను అందజేశారు. వేడుకల్లో భాగంగా వాక్ ఫౌండేషన్ కల్చరల్ అంబాసిడర్ పులిపాటి చేసిన కూచిపూడి ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.